క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో చేరికలు



ఫిరంగిపురం: మండలంలోని గుండాలపాడు గ్రామానికి చెందిన జమ్ముల రాము నేతృత్వంలో 15 కుటుంబాలకు చెందిన వారు గురువారం ఫిరంగిపురం పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్.రామచంద్రరావు, హుస్సేన్, షేక్.జాన్‌సైదా, జానీ, కామేశ్వరరావు, రాజేష్, షేక్.బాజి, బి.శ్రీనివాసరెడ్డి, కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, టి.కృష్ణ, ప్రకాష్‌రావు, లింగయ్య, పుల్లారావు, వీరయ్య, శ్యామయ్యలు ఉన్నారు.

తాడేపల్లిలో...

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలో నివాసముండే బీసీ సంఘం నాయకుడు గురువారం తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య భర్త మురుగుడు సత్యం బీసీ నాయకుడైన వంగ సత్యనారాయణకు వైఎస్సార్ సీపీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వంగ సత్యనారాయణ రాకతో పోలకంపాడు ప్రాంతంలోని యాదవ కమ్యూనిటీలో వైఎస్సార్ సీపీకి బలం చేకూరింది. ఈ సందర్భంగా వంగ సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బీసీలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని ఏ పార్టీలోనూ బీసీలకు రాజ్యాధికారంలో అవకాశం ఇవ్వని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో ఉండవల్లి బీసీ నాయకులు కోక సత్యనారాయణ, ప్రభుదాసు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

వీరుల చరిత్ర ముందు తరాలకు స్ఫూర్తి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళా వేదికపై గురువారం సాయంత్రం శ్రీ మహారాణా ప్రతాప్‌సింగ్ జయంతి నిర్వహించారు. గుంటూరు బొందిలి ఆధ్వర్యంలో వేడుకలు జరగ్గా, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ముఖ్య అతిథి డొక్కా మాణిక్యవరప్రసాద్ హాజరై మాట్లాడుతూ మహారాణా ప్రతాప్‌సింగ్ వంటి వీరుల చరిత్ర ముందు తరాలు తెలుసుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో రామరాజు ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామరాజు శ్రీనివాస్, ఏపీ బొందిలి సంఘం అధ్యక్షులు కె.శంకర్‌సింగ్, ఉపాధ్యక్షుడు క్షత్రిధర్మనారాయణసింగ్, విశ్రాంత ఏఎస్పీ భూపాల్‌సింగ్, నూతలపాటి తిరుపతయ్య, మహీందర్ సింగ్, శిండే లక్ష్మీనారాయణ, కుమార్ శేఖర్ పాల్గొన్నారు. అనంతరం బొందిలి నిత్యశ్రీహర్షిణి, భువనశ్రీ (కర్నూల్)లను సత్కరించారు.

రాష్ట్ర మంత్రి తానేటి వనితపై దాడి సిగ్గుచేటు

నెహ్రూనగర్: రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనితపై టీడీపీ గుండాలు దాడి చేయడం సిగ్గుచేటని ఎమ్మార్పీస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చందోలు శశికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ మాదిగ మహిళపై దాడి చేయడం మాదిగలపై దాడి జరిగినట్లుగానే భావిస్తున్నామన్నారు. అధికారంలోకి రాకముందే మాదిగలపై దాడులకు దిగితే ఇంకా అధికారంలోకి వస్తే ఎటువంటి పరిస్థితులు వస్తాయో అని ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో మాదిగలంతా టీడీపీకి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి



లక్ష్మీపురం: ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం 'ప్రశ్నార్థకంగా మారిన ప్లాస్టిక్‌పై పోరు' అంశంపై చర్చ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పర్యావరణ ఉద్యమనేత పి.ఎస్.మూర్తి మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను అంతం చేసి భవిష్యత్తును కాపాడుకునే విషయంలో కొత్త అంతర్జాతీయ ఒడంబడిక నిమిత్తం గత వారం కెనడాలోని ఒట్టావాలో జరిగిన 192 దేశాల ప్రతినిధుల సమావేశంలో సరైన నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిరోధించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. న్యాయవాది అవధానుల హరి మాట్లాడుతూ ప్లాస్టిక్ ఉత్పత్తే పర్యావరణానికి పెను ప్రమాదమన్నారు. కార్యక్రమంలో పర్యావరణ ప్రచారకులు అమరాచారీ, సాయిబాబు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల
ఆత్మబంధువు సీఎం జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల సంక్షేమానికి కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళగిరి నియోజకవర్గ అభ్యర్థిగా చేనేత వర్గానికి చెందిన మహిళ మురుగుడు లావణ్యకు ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించి బీసీలకు తగిన ప్రాధాన్యం ఇచ్చారు. మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి తన సాయశక్తులా కృషి చేస్తానని లావణ్య సాక్షికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

- అభివృద్ధే మంత్రంగా ముందుకు సాగుతానని చెబుతున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్యతో సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూ..



సాక్షి ఇంటర్వ్యూ

ప్రశ్న: అవతల ధనవంతులు లోకేష్ బరిలో ఉన్నారు. మీరు గెలుస్తారా?

జవాబు: బడుగు బలహీన వర్గాలకు సీట్లు ఇచ్చి రాజ్యాధికారం వారికి ఇచ్చేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయం. పెత్తందార్లు, పేదలకు మధ్య జరుగుతున్న పోటీలో తప్పకుండా విజయం సాధిస్తానన్న నమ్మకం వుంది.

ప్రశ్న: మీది రాజకీయ కుటుంబ నేపథ్యం.. వారి అనుభవం మీ గెలుపుకు ఉపయోగపడుతుందా?

జవాబు: తప్పకుండా వారి అనుభవం, రాజకీయ నేపథ్యం నా గెలుపును సునాయాసం చేస్తాయనడంలో సందేహం లేదు.

ప్రశ్న: మీరు గెలిస్తే నియోజకవర్గానికి ఏమి చేస్తారు?

జవాబు: గతంలో ఎన్నడూ లేని విధంగా గత ఐదు సంవత్సరాల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ఎమ్మెల్యే ఆర్కే ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధితో నియోజకవర్గం రాష్ట్రానికే ఆదర్శ నియోజకవర్గంగా నిలిచిందనడంలో సందేహం లేదు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తర్వాత రానున్న ఐదేళ్ల కాలంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే ఆర్కే అన్న, మామ ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటు ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తాను.

ప్రశ్న: చేనేత పరిశ్రమపై తీసుకునే చర్యలేంటి?

జవాబు: గతంలో ఎన్నడూ లేని విధంగా గత ఐదేళ్లలో చేనేత పరిశ్రమ అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఆర్కే కృషి చేశారు. వైఎస్సార్ ప్రగడ కోటయ్య చేనేత భవనం నిర్మాణం, చేనేత మగ్గాల షెడ్ల నిర్మాణంతో పరిశ్రమకు నూతన శోభ వచ్చింది. రానున్న ఐదేళ్లలో చేనేత పరిశ్రమ అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

ప్రశ్న: ప్రచారంలో మీకు ప్రజల నుంచి సమస్యలు ఏంటి, వాటి పరిష్కారానికి ఏమి చర్యలు తీసుకుంటారు?

జవాబు: ముఖ్యంగా నగరంలో డ్రైనేజీ సమస్య, తాగునీటి సమస్యలను నా దృష్టికి తీసుకువచ్చారు. గెలిస్తే డ్రైనేజీ సమస్యతో పాటు తాగునీటి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుంది.

ప్రశ్న: మౌలిక వసతుల కల్పనకు మీరు తీసుకునే చర్యలు ఏంటి?

జవాబు: మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌గా మారాక నగరం విస్తరిస్తుంది. అదే విధంగా జనాభా పెరుగుతుంది. వారికి మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటాము. ముఖ్యంగా తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలపై దృష్టి సారించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాము. విలీన గ్రామాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధికి కృషి చేస్తాము.

ప్రశ్న: రానున్న ఐదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా తీసుకునే చర్యలేమిటి?

జవాబు: ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అవినీతి రహిత పాలన అందించే లక్ష్యంగా ముందుకు వెళతాను. నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తాను.

దుగ్గిరాల గడ్డ..వైఎస్సార్ సీపీ అడ్డా

- మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య
- వైఎస్సార్ సీపీ పాలనలో ఎన్నో ఏళ్ల నాటి అపరిష్కృత సమస్యలకు పరిష్కారం
- మరోసారి అధికారం చేపడితే పూర్తి స్థాయిలో అభివృద్ధి
- దుగ్గిరాలలో ఎమ్మెల్యే సతీమణి రాధాదేవితో కలిసి ఎన్నికల ప్రచారం



రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తూ..

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అడ్డా అని మరోసారి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ప్రభంజనం సృష్టించాలని మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య అన్నారు. గురువారం దుగ్గిరాల గ్రామ పరిధిలో మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే సతీమణి ఆళ్ల రాధాదేవి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణలతో కలసి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా దుగ్గిరాల కృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ అబ్దుల్ కలామ్, ఇతర జాతీయ నాయకులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు, అభివృద్ధి జరుగుతుందన్నారు. ఆయన ముఖ్యమంత్రి అవ్వాలంటే పేద ప్రజలతో పాటు అన్ని వర్గాల వారు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు మే 13న జరుగనున్న ఎన్నికల్లో గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యతో పాటు తనకు ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని కోరారు. దుగ్గిరాల మండలంలో మన



చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న మురుగుడు లావణ్య

ఎమ్మెల్యే, మన అందరి అన్న ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ప్రభుత్వ నిధులతో పాటు ఆయన సొంత నిధులతో ఎంతో అభివృద్ధి చేశారన్నారు. దుగ్గిరాల గ్రామంలో ఇళ్లులేని అక్కా చెల్లెమ్మలకు దుగ్గిరాల సమీపంలో ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టారన్నారు. దుగ్గిరాల గ్రామంలో కాలువ దాటేందుకు ఫుట్ బ్రిడ్జి లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడడంతో ఎమ్మెల్యే ఆర్కే చొరవ చూపించి కొంతమంది దాతలతో మాట్లాడి ఫుట్ బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేసి 40–50 సంవత్సరాల నుంచి ఉన్న సమస్యను పరిష్కరించారని అన్నారు. గ్రామంలో అంతర్గత రోడ్లను నిర్మించడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను 70 శాతం మెరుగు పరిచారన్నారు. దుగ్గిరాల ప్రధాన రహదారిని ఎన్నిసార్లు నిర్మించినా వర్షాకాలంలో దెబ్బతినడంతో కొంతమేర సీసీ రోడ్డు నిర్మించారని, రాబోయే కాలంలో వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టగానే దుగ్గిరాల లాకుల దగ్గర నుంచి తెనాలి రోడ్డు లాకుల వరకు పూర్తి స్థాయిలో సీసీ రోడ్డు నిర్మించి ఇరు పక్కల డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డేశ్వరపు రజనీకాంత్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డివిఆర్), మండల అధ్యక్షులు శృంగారపాటి రత్నం, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజి, వీరయ్య, షేక్ సుభాని, షేక్ నాగూర్, ఎండీ బాజి, దుగ్గిరాల సర్పంచ్ బాణావత్ కుషీబాయి, వెంకటేశ్వరరావు నాయక్, ఎంపీటీసీ బాణావత్ వాలీబాయి, జూపూడి జాన్సన్, తోలేటి జాన్సన్, మల్లవరపు నాగరాజు, షేక్ సలీమ్, తాడిబోయిన వెంకటరావు, శేషగిరి, రమేష్, నల్లనూకల కోటి యాదవ్, ఎండీ మొహిద్దీన్, సయ్యద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

పరుగు పందెంలో దుగ్గిరాల లైన్‌మన్ ప్రతిభ

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల గ్రామంలో విధులు నిర్వహిస్తున్న లైన్‌మన్ కె.నరేంద్రబాబు రన్నింగ్ కాంపిటేషన్‌లో రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం సాధించిన సందర్భంగా గురువారం దుగ్గిరాల సబ్ స్టేషన్ ఏఈ ఎస్.సత్యనారాయణ అభినందించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నెల్లూరు ఏపీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఇటీవల నిర్వహించిన ఇంటర్ సర్కిల్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 2023–2024 పోటీలలో 5వేల మీటర్ల పరుగు పందెంలో కె.నరేంద్రబాబు పాల్గొని ఆంధ్రప్రదేశ్‌లో తృతీయ స్థానంలో నిలవడం తమకెంతో గర్వకారణంగా ఉందని అన్నారు. నరేంద్రబాబు మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నామన్నారు. లైన్‌మెన్ నరేంద్రబాబుకు సహోద్యోగులు అభినందనలు తెలిపారు.



నరేంద్రబాబుకు సర్టిఫికెట్ అందిస్తున్న అధికారులు

పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరగాలి

గుంటూరు ఎడ్యుకేషన్: సార్వత్రిక ఎన్నికల్లో పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరగాలని లెట్స్ ఓట్ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కే మాలకొండయ్య పేర్కొన్నారు. లెట్స్ ఓట్ ఆర్గనైజేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో ఓటు హక్కు ప్రాధాన్యం చాటుతూ గురువారం బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియం నుంచి 12 కే సైక్లింగ్ నిర్వహించారు. జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన మాలకొండయ్య మాట్లాడుతూ చైతన్యవంతమైన గుంటూరు ప్రజలు ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని గతంలో కంటే అత్యధికంగా పెంచేందుకు ఉత్సాహంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా ఓటు ప్రాధాన్యాన్ని చాటుతూ టీషర్ట్స్, టోపీలు ధరించి సైకిళ్లకు ప్లకార్డులు కట్టుకుని నగరంలోని వివిధ కూడళ్ల వద్ద ఓటర్లను చైతన్యపరిచారు. లెట్స్ ఓట్ జిల్లా కన్వీనర్ బాలాజీ శ్రీనివాస్, బండ్లమూడి సుబ్బయ్య, డాక్టర్ పోసాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటరూ మేలుకో... ఓటు వేసి బాధ్యత పెంచుకో

- గుంటూరు పశ్చిమలో పోలింగ్ శాతం అత్యల్పం
- గత ఎన్నికల్లో 65.7 శాతం నమోదు
- ఓటు హక్కు వినియోగంపై ఆసక్తి చూపని నగరవాసులు
- ఓటర్ల సంఖ్య 2,78,158
- పురుషులను అధిగమించి పైచేయి సాధించిన మహిళా ఓటర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్నికల పండుగొచ్చింది. దేశంలో సందడి నెలకొంది. పల్లె నుంచి పట్టణం వరకు పిల్లాపల నుంచి వృద్ధుల వరకు ఎన్నికలు ఓ ఉత్సాహాన్ని నింపుతాయి. అలాంటి ఎన్నికలపై పట్టణ వాసులు కినుక వహించడం ఆందోళన కలిగిస్తోంది. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడంలో నగర ఓటర్లు వెనుకడుగువేస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఓటింగ్ 65.7 శాతానికి పరిమితం కావడం ఇందుకు నిదర్శనం. అంటే ఈ నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగిన ప్రతి వంద మంది ఓటర్లలో 65 మందే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగిలిన 35 మంది గడప దాటలేదు. విద్యావంతుల నిలయంగా, గుంటూరు జిల్లా కేంద్రంగా ఉన్న పశ్చిమ నియోజకవర్గం విద్య, వైద్య, ఆర్థిక, సామాజిక రంగాల్లో అభివృద్ధి చెందింది. రాజకీయంగా ఎంతో చైతన్యవంతమైన నియోజకవర్గం ఓటింగ్‌లో మాత్రం రాష్ట్రస్థాయిలో వెనుకబాటుకు గురవుతోంది. విద్యాపరంగా రాష్ట్రస్థాయిలో గుర్తింపు కలిగిన నియోజకవర్గం వ్యాపార కేంద్రంగాను విరాజిల్లుతోంది. ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నగర ఓటర్లు ఓటు హక్కు ప్రాధాన్యాన్ని గుర్తెరిగి ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం విజ్ఞప్తి చేస్తోంది.



గత నెల 27న గుంటూరులో ఓటు హక్కుపై చైతన్య పరుస్తూ 3కే వాక్ (ఫైల్)

సంవత్సరం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
2019	1,31,526	1,37,638	54	2,69,218
2024	1,35,426	1,42,688	44	2,78,158

పోలింగ్ 65.7 శాతానికి పరిమితం..

2019 ఏప్రిల్ 11న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంలో 65.7 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 2,65,135 మంది ఓటర్లలో 1,74,147 మంది ఓటనర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మిగిలిన 90,988 మంది ఓటు వేసేందుకు గడప దాటలేదు.

పోలింగ్ శాతం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు

నగరంలో పోలింగ్ శాతం పెంచేందుకు అధికార యంత్రాంగంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఓటర్లను చైతన్యపర్చి ఓటు హక్కును సద్వినియోగం చేసుకునే దిశగా చైతన్యపరుస్తున్నాయి. ఇందులో భాగంగా తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకోనున్న యువతను చైతన్యపరుస్తూ గత నెల 27న బృందావన్‌గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియం వద్ద లెట్స్ ఓట్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన ఓటర్ల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఇతర అధికారులు ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం పెంచే ఉద్దేశంతో చేపట్టిన కార్యక్రమంలో ఓటు హక్కు ప్రాధాన్యాన్ని చాటుతూ నిర్వహించిన 3కే వాక్‌లో వందలాదిగా ప్రజలు, యువతీ, యువకులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో ప్రజలకు మేలు



ప్రచారం నిర్వహిస్తున్న హర్షిత్, సాయినివ్య



భారీ ఊరేగింపు నిర్వహిస్తున్న అభిమానులు

ఫిరంగిపురం: ప్రతి గ్రామంలో సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టడం ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని తాడికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత తనయుడు మేకతోటి హర్షిత్, ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్య కుమార్తె సాయినివ్య అన్నారు. మండలంలోని 113.తాళ్లూరు, మునగపాడు గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ పథకాలు గురించి వివరించారు. రానున్నది జగనన్న రాజ్యమని అందరికి సంక్షేమ ఫలాలు అందాలంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ప్రచారంలో అనేక మంది అభిమానులు పాల్గొని నినాదాలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్.షహేలా నర్గీస్, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం సునీత, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, చేవూరి రామమోహన్‌రెడ్డి, చేవూరి నాగవేణి, పాలపాటి భైరాగినాయుడు, పి.రఘు, రాజశేఖరరెడ్డి, కొండారెడ్డి, పి. అంజిరెడ్డి, పి.శ్రీనివాసరెడ్డి, సీహెచ్ సాంబిరెడ్డిలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల అసత్య ప్రచారం నమ్మొద్దు

మంగళగిరి: టీడీపీ నాయకులు నీచ రాజకీయాలు మానుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు గుత్తికొండ సీతారామిరెడ్డి హితవు పలికారు. నగర పరిధిలోని చినకాకానికి చెందిన సీతారామిరెడ్డి వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరినట్లు ప్రచారం చేసుకోవడంపై సీతారామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నగర పరిధిలోని ఆటోనగర్‌లో గల వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి కార్యాలయంలో గురువారం మాట్లాడారు. తాను పార్టీ మారడంతో పాటు తమ కుటుంబంలో విభేదాలు వచ్చినట్లు టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించడం దారుణమన్నారు. తాము నలుగురు సోదరులం కలిసి కట్టుగా వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. లేని దానిని ఉన్నట్లుగా సృష్టించి టీడీపీ నాయకులు అసత్య ప్రచారానికి పాల్పడ్డారన్నారు.



మాట్లాడుతున్న సీతారామిరెడ్డి

అసత్య ప్రచారం నమ్మవద్దని కార్యకర్తలకు తెలిపారు. అందరం ఐక్యంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుత్తికొండ రామకృష్ణారెడ్డి, కాటంరాజు, లింగినేని రాము, గండికోట హేమ, కఠారి రామనాగు, గుత్తికొండ సీతారామిరెడ్డి, మల్లవరపు చిన్నోడు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో 24 గంటలు కుక్క కాటుకు ఓపీ సేవలు

సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్

గుంటూరు మెడికల్: కుక్కకాటు బాధితులకు గుంటూరు జీజీహెచ్‌లో 24 గంటలు ఓపీ వైద్య సేవలు ఉన్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. గురువారం ఆస్పత్రి ఓపీ విభాగంలో కుక్కకాటుకు ఇంజక్షన్లు ఇచ్చే 14 బీ గదిని ఆయన పరిశీలించారు. కుక్క కాటు భాధితులు రోజుకు ఎంత మంది వస్తున్నారు, వారికి అందుతున్న వైద్య సేవల గురించి ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రి లోని 14 ఓపీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం4 గంటల వరకు ఉంటుందన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు పాదిల ప్రసాద్ బ్లాక్‌లో కుక్కకాటు ఇంజక్షన్లు చేస్తారని చెప్పారు. ఒక్కొక్కసారి 50 నుంచి 100 మంది వరకు కుక్క కాటు బాధితులు వస్తున్నారని తెలిపారు. జీజీహెచ్‌కు ప్రతిరోజు కుక్కకాటు బాధితులు ఎంతమంది వస్తున్నారో వాటి వివరాలను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ఆన్ లైన్ లో పొందుపర్చాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. కుక్క కరచిన వెంటనే వ్యాక్సిన్ తీసుకోవాలని, వీధి కుక్కలు, పెంపుడు కుక్కల విషయం లో కూడా పలు జాగ్రత్తలు పాటించాలన్నారు. కుక్క కాటు వల్ల రేబీస్ అనే ప్రాణాంతక జబ్బు వస్తుందని అది వస్తే మనిషి కి ప్రాణానికే ముప్పు వస్తుందని హెచ్చరించారు.

ఏఎన్‌యూ అమెరికన్ యూనివర్సిటీలతో ఎంఓయూ

ఏఎన్‌యూ: అమెరికాకు చెందిన టెక్సాస్ వెస్లియాన్ యూనివర్సిటీ, లెటర్నియో యూనివర్సిటీలతో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎంఓయూ కుదుర్చుకుంది. టెక్సస్ వెస్లీయాన్ యూనివర్సిటీ ఇంటర్నేషనల్ అడ్మిషన్ కోఆర్డినేటర్ జూలిస్మిత్ బృందం గురువారం ఏఎన్‌యూని సందర్శించింది. యూనివర్సిటీ సైన్స్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ విభాగాన్ని బృంద సభ్యులు సందర్శించారు. ఆ విభాగంలోని మౌలిక వసతులు, పరిశీలించారు. ఫార్మసి, ఫిజిక్స్, బుద్దిస్ట్ స్టడీస్ విభాగాలను సందర్శించి విదేశీ విద్యార్థులతో మాట్లాడారు. అంతర్జాతీయ విద్యార్థుల వసతి గృహం సందర్శించి సదుపాయాలను విద్యార్థుల నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైస్ చాన్సలర్ ఆచార్య పి.రాజశేఖర్‌తో సమావేశమయ్యారు. అమెరికాలోని లెటర్నియో యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ కోర్సు చదవడానికి నాగార్జున విశ్వవిద్యాలయం విద్యార్థులకు ఉన్న అవకాశాన్ని వివరించారు. విద్యార్థులు సగం కోర్సు ఏఎన్‌యూలోను మిగిలిన కోర్సును అమెరికా యూనివర్సిటీలో పూర్తి చేసుకునే వెసులుబాటు ఈ ఎంఓయూ ద్వారా అవకాశం ఉందని ఏఎన్‌యూ ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ డైరెక్టర్ ఆచార్య జి.చెన్నారెడ్డి తెలిపారు. ఈ ఎంవోయూ మూడేళ్లపాటు కొనసాగుతుందన్నారు.



ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్ సమక్షంలో ఎంఓయూ పత్రాలు మార్చుకుంటున్న వర్సిటీ ప్రతినిధులు